సాక్షి
కామారెడ్డి
7
శుక్రవారం । 6 । జనవరి । 2023

గరిష్టం/కనిష్టం
30.0 /17.4
వాతావరణం
పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.


బారికేడ్లను తోసుకుంటూ కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి యత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు


జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

భూమి కోసం రైతు ఘోష!

భూమిని నమ్ముకుని జీవిస్తున్న అన్నదాతలు.. ఆ భూమిని కాపాడుకునేందుకు పోరు బాట పట్టారు. కామారెడ్డి బల్దియాలో మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్నవారు నెలరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. అయినా సర్కారు స్పందించకపోవడంతో గురువారం రైతులు కుటుంబ సమేతంగా జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. పలువురు గాయాల పాలయ్యారు. వినతిపత్రం తీసుకోవడానికి కలెక్టర్ రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

- మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు
- జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ
- కలెక్టర్ తీరుపై పెల్లుబికిన ఆగ్రహం
- ఉద్రిక్తంగా మారిన కలెక్టరేట్ ముట్టడి
- బారికేడ్లను తోసుకుని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నం
- పోలీసులు, రైతుల మధ్య తోపులాట.. పలువురికి గాయాలు
- రాత్రి వరకు కొనసాగిన ధర్నా
- కలెక్టర్ దిష్టిబొమ్మకు వినతిపత్రం ఇచ్చి ఆందోళన విరమణ


పోలీసులపైకి చెప్పులు విసురుతున్న రైతులు

సాక్షి కామారెడ్డి/కామారెడ్డిటౌన్ : మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్చిపూర్, దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, రామేశ్వరపల్లి, అడ్లూర్, కామారెడ్డి పట్టణం, టెక్రియాల్ తదితర గ్రామాలకు చెందిన రైతులు గురువారం జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. సుమారు 3వేల మంది రైతులు తమ కుటుంబ సభ్యులతో ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని సీఎస్‌ఐ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ.. కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, సుభాష్‌రోడ్, జేపీఎన్‌రోడ్, సిరిసిల్లరోడ్, ఇందిరాచౌక్, అడ్లూర్ రోడ్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. కలెక్టరేట్ ముట్టడికి రైతులు యత్నించారు. రైతులు భారీగా తరలివస్తుండడంతో పోలీసులు పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. రైతులు కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. కలెక్టర్ వచ్చి వినతి పత్రం తీసుకుని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 3 గంటలవరకు కలెక్టర్ రాకపోవడంతో ఆగ్రహానికి గురైన రైతులు.. ఒక్కసారిగా లేచి కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లడానికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు, రైతులకు మధ్య పలుమార్లు తోపులాట జరిగింది. ఐదుగురు రైతులకు గాయాలు కాగా, పలువురు మహిళా రైతులు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు అడ్డుకుంటుండడంతో ఆగ్రహంతో చెప్పులు, కర్రలు విసిరారు. బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి రైతులను శాంతిపజేసి ధర్నాలో కూర్చోబెట్టారు. అయితే ఏఎస్పీ అన్యోన్య, డీఎస్పీ సోమనాథం రైతులు, నాయకులపై దురుసుగా మాట్లాడడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. కలెక్టరేట్ ప్రధాన గేట్‌ను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు రైతులు యత్నించారు. ప్రధాన గేటుపై నుంచి దూకి పలువురు లోపలికి వెళ్లగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. కౌన్సిలర్ మానస భర్త అన్మండ్ల సురేశ్ ముళ్ల కంచెలో పడడంతో గాయాలయ్యాయి. తోపులాటలో రామేశ్వరపల్లి చెందిన రైతు సంతోష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

పోరాటానికి పార్టీల మద్దతు

ఆందోళనలో బీజేపీ నేత వెంకటరమణారెడ్డితో పాటు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి సుభాష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జమునా రాథోడ్, కామారెడ్డి నాయకులు పండ్ల రాజు, ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి నిజ్జన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కామారెడ్డి బంద్

సాక్షి, కామారెడ్డి: మాస్టర్ ప్లాన్‌కు నిరసనగా శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గంలో బంద్ పాటించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు జేఏసీ కన్వీనర్ జగన్నాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. బంద్‌లో అన్ని వర్గాలు పాల్గొనాలని కోరారు.

వంటా వార్పు..

నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా స్పందించని కలెక్టర్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతిపత్రం తీసుకోవడానికి, రైతులకు సమాధానం చెప్పడానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల మాటలు వింటూ రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నా కలెక్టర్ స్పందించకపోవడంతో రైతులు అక్కడే కూర్చుని నిరసన తెలిపారు. టెంట్‌లు వేసుకుని, వంటావార్పు నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు ఆందోళన చేశారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ గేటుకు కలెక్టర్ దిష్టిబొమ్మను కట్టి వినతి పత్రమిచ్చి ఆందోళన విరమించారు.


రోడ్డుపై భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రఘునందనరావు, నాయకులు వెంకటరమణారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్‌పై మంత్రి ఆగ్రహం!

కామారెడ్డి టౌన్: నూతన మాస్టర్ ప్లాన్ తీరు, రైతుల ఆందోళన విషయంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మాస్టర్ ప్లాన్‌పై రైతులకు అవగాహన కల్పించకుండా వారు ఆందోళన చెందడానికి కారకులయ్యారని మండిపడినట్లు సమాచారం.

కలెక్టర్‌కు భయమెందుకు?

రైతుల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకోవడానికి కలెక్టర్ ఎందుకు భయపడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రశ్నించారు. రైతుల సమస్యపై జిల్లా మెజిస్ట్రేట్ స్పందించకపోవడం దారుణమన్నారు. ట్విట్టర్ టిల్లు మాటలతో కాకుండా ఇండస్ట్రియల్ జోన్ ఎత్తివేస్తామని, రైతుల భూముల్లోనుంచి వంద ఫీట్ల రోడ్లు వేయబోమని రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని మంత్రి కేటీఆర్‌నుద్దేశించి అన్నారు.


ఎంపీ అర్వింద్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం జిల్లాకేంద్రానికి రానున్నారని ఆ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి తెలిపారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు


గోడ దూకి కలెక్టరేట్‌లోకి వెళ్లిన రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి గోడ ఎక్కిన రైతు


కలెక్టర్ దిష్టిబొమ్మకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

న్యూస్‌రీల్

29న విష్ణు సహస్ర నామాలపై పోటీ

కామారెడ్డి అర్బన్: అచ్యుతాష్టకం, విష్ణు సహస్ర నామాలపై ఈనెల 29న పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి వేదాంతం సీతారామచంద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 10 –15 ఏళ్ల మధ్య వయసువారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 94909 97596 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంసీహెచ్‌ను సందర్శించిన 'కాయకల్ప' బృందం



బాన్సువాడ టౌన్: బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని గురువారం కాయకల్ప బృందం సందర్శించింది. బృంద సభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్యాధికారి నారాయణరెడ్డి, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ ఝాన్సీరాణి, స్టాఫ్ నర్స్ స్వప్న ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బందితోనూ మాట్లాడారు. గతంలో బాన్సువాడకు వచ్చిన కాయకల్ప అవార్డుల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని బృందం సభ్యులు తెలిపారు. వారి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, హెడ్‌నర్సులు అమృతమ్మ, మల్లేశ్వరి, కృష్ణవేణి, ఆరోగ్యజ్యోతి, శాంతకుమారి తదితరులు ఉన్నారు.

మెడికల్ కాలేజీకి నిధులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికిసర్కారు నిధులు విడుదల చేసింది. రూ. 4.53 కోట్లను విడుదల చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మూడో అంతస్తులో షెడ్డు, పాత టీబీ బ్లాక్‌లో అదనపు వార్డులు నిర్మించనున్నారు.

బల్దియాకు అవార్డు



కామారెడ్డి టౌన్: ఓడీఎఫ్ లక్ష్యాన్ని చేరుకున్నందుకు కామారెడ్డి బల్దియాను అవార్డు వరించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సీడీఎంఏ సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

కామారెడ్డి క్రైం : జాతీయ స్థాయి యువజనోత్సవాలలో జిల్లాలోని యువతీయువకులు రాణించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి డిగ్రీ కళాశాలలోని చింతల బాలరాజు గౌడ్ స్మారక సమావేశ మందిరంలో గురు వారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజనోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడు తూ స్వామి వివేకానందను యువకులు స్ఫూర్తి గా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లా కళా ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందుప్రియ, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సై న్స్ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య, వైస్ ప్రిన్సి పాల్ చంద్రకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జానపద ఉత్సవాల విజేతలు వీరే..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి జానపద ఉత్సవాల విజేతలను ప్రకటించారు. జానపద నృత్యంలో అంబిక బృందం ప్రథమ, ప్రియాంక బృందం ద్వితీయ స్థానంలో నిలిచాయి. జానపద గీతాల్లో మానస బృందం ప్రథమ, పల్లవి బృందం ద్వితీయ స్థానం పొందాయి. ఉపన్యాసంలో మౌనిక విజేతగా నిలిచింది. వీరందరు రాష్ట్రస్థాయి జానపద ఉత్సవాల్లో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా సిర్పలింగం, ఉమబాల, పాయల్ వ్యవహరించారన్నారు.

రుణాలను వసూలు చేయాలి

- 18 నుంచి కంటి వెలుగు ప్రారంభం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: బ్యాంకు లింకేజీ రుణాలను ఈనెలాఖరులోగా 90 శాతం వసూలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాల వసూళ్లపై ఐకేపీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు రామారెడ్డి, రాజంపేట, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో బ్యాంకు లింకేజీ రుణాలు 80 శాతం వసూలు చేశారన్నారు. స్త్రీ నిధి రుణాలు 100 శాతం వసూలయ్యాయన్నారు.

జనవరి 18న కంటి వెలుగు ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో సాయన్న, ఏపీడీ మురళీకృష్ణ, డీపీఎంలు సుధాకర్, రమేష్, అధికారులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

కామారెడ్డి క్రైం: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆపరేషన్ స్మైల్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటుక బట్టీలు, హోటళ్లు, గృహ నిర్మాణ పనుల్లో బాల కార్మికులు పనిచేస్తే గుర్తించి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగించకుండా అవగాహన కల్పించాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆపరేషన్ స్మైల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి స్రవంతి, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ రమ్య, జిల్లా కార్మిక సంక్షేమ అధికారి సురేందర్, సీడబ్ల్యూసీ సభ్యురాలు స్వర్ణలత, ఎక్సైజ్, పోలీస్, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన..

కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంలోని బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. బ్యాలెట్ యూనిట్లకు ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ గెలిచేది నేనే..

- అనుమానమే అక్కర్లేదు..
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- మేలు చేసే నాయకుడిని ప్రజలు వదులుకోరని వ్యాఖ్య


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: వచ్చే ఎన్నికల్లోనూ బాన్సువాడనుంచి గెలిచిదే తానేనని, దీనిపై అనుమానమే అక్కర్లేదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తాడ్కోల్ గ్రామంలో 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాం, రైతు వేదిక, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. షాదీఖానా, కులసంఘాల భవనాల పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్లుగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానన్నారు. ప్రజలు తమకు మేలు, న్యాయం చేసేవారినే కోరుకుంటారని, నిత్యం వారి సమస్యలను పరిష్కరించే నాయకుడిని పోగొట్టుకోరని పేర్కొన్నారు. ప్రజలు పాలిచ్చే గేదెను కాదని దున్నపోతుకో, గొడ్డు బర్రెకో గడ్డి వేయరన్నారు. ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉందన్నారు. అయినా తన విజయంపై ఎలాంటి అనుమానం లేదని, అలాగే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారాన్ని నిలబెట్టుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. తాను అంజయ్య మొదలుకుని ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్‌లను సీఎంలుగా చూశానని, కానీ కేసీఆర్ సారథ్యంలో జరిగినంత అభివృద్ధి ఎప్పుడూ లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయంలో గాని, కుల సంఘాలకు భవనాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులను వెంటనే మంజూరు చేయడంలో ఉన్నంత ధైర్యం గతంలో ఉండేది కాదన్నారు. ఎమ్మెల్యేలను, నాయకులను కొనడం, మంచి పనులు చేస్తున్న ప్రభుత్వాలను కూల్చడం తప్ప చేసేదేమీ లేదని బీజేపీని ఉద్దేశించి పరోక్షంగా విమర్శించారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బుడ్మి సొసైటీ చైర్మన్ పిట్ల శ్రీధర్, హైకోర్టు న్యాయవాది భూషణ్‌రెడ్డి, సర్పంచ్ రాజమణి, ఎంపీపీ నీరజారెడ్డి, జెడ్పీటీసీ పద్మారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింలు, సంగ్రాంనాయక్, ఎజాస్, పాత బాలకృష్ణ, కుమ్మరి రాజు, గంగారాం, లక్ష్మణ్‌గౌడ్, రాజిరెడ్డి, నాందేవ్, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు..

బాన్సువాడ రూరల్: రాష్ట్రంలోనే కాదు బహుశా దేశంలోనే ఏ ఎమ్మెల్యే నిర్మించని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయించానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కొత్తబాదిలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ పిట్ల శ్రీధర్‌లతో కలిసి 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను ప్రారంభించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లారెడ్డి, సాయిరెడ్డి, రఘురామయ్య, ఉస్మాన్, సలీం, నయీం, సాయిలు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుర్చీలపైనే వైద్యం!



బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సిబ్బంది కుర్చీలపై పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారు. రోగులపై సిబ్బందికి చిన్న చూపు ఉండటంతో కనీసం బెడ్ల మీద పడుకోబెట్టకుండా కుర్చీలపైనే ఇంజెక్షన్‌లు ఇస్తూ, సెలైన్‌లు పెడుతున్నారు. సిబ్బంది నిర్వాకంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీచర్‌ను దూషించిన వారిని శిక్షించాలి

కోటగిరి: కోటగిరి జెడ్పీ హైస్కూల్‌లో దళిత ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించి, గుడికి తీసుకెళ్లి బలవంతంగా బొట్టు పెట్టిన వారిని శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్ వెస్లీ, స్కైలాబ్‌బాబు హైదరాబాద్ నుంచి 'సాక్షి'తో మాట్లాడారు. కంప్యూటర్ యుగంలో కూడా ఓ టీచర్‌ను క్లాస్ రూం నుంచి లాక్కెళ్లి బొట్టు పెట్టుకొమ్మని బెదిరించడం, దూషించడం దౌర్జన్యం, రౌడీయిజం కాదా అన్నారు. ఓ వ్యక్తి నాస్తికుడిగా ఉండడం తప్పా అన్నారు.

హోటళ్లలో తనిఖీ



వర్ని: వర్నిలో ఎనిమిది హోటళ్లపై సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. గృహ అవసరాలకు వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌గా వాడుతున్నారనే సమాచారం మేరకు అధికారులు దాడులు చేశారు.8 హోటళ్లపై దాడులు చేనసి, 14 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు వర్ని సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ నిఖిల్ రాజ్ తెలిపారు. హోటల్ యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో డీటీ అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల్‌వాసికి పీహెచ్‌డీ



లింగంపేట: మండలంలోని బోనాల్‌కు చెందిన బట్టు విఠల్ గురువారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'జాతీయ ఉపాధి హామీ పథకంలో మహిళలకు సమాన వేతనం- ఆర్థిక స్వావలంబన- సాధికారత' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఓయూ వీసీ రవీందర్ విఠల్‌కు డాక్టర్ ప్రదానం చేశారు.

18లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్ష ఫీజును ఈ నెల 18 లోపు చెల్లించాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజులను చెల్లించాలని పేర్కొన్నారు. బీఏ, బీకాం విద్యార్థులు రూ.150, సైన్స్ విద్యార్థులు రూ.150తో పాటు ప్రయోగ పరీక్షల ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముట్టడి ఉద్రిక్తం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌లో భూమి కోల్పోతున్న రైతులు కదం తొక్కారు. తమకు న్యాయం చేయాలని ఎనిమిది గ్రామాల రైతులు గురువారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది.

ఎంపీ అర్వింద్‌ను అడ్డుకున్న పోలీసులు

రైతుల ధర్నాకు కలెక్టరేట్‌కు వస్తున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను రామారెడ్డి రోడ్‌లో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి వెళ్లవద్దని అనుమతి లేదని వాధించారు. పోలీసులతో ఎంపీ కాసేపు వాగ్వాదం చేశారు. తర్వాత కలెక్టరేట్‌కు వెళ్లి రైతులకు మద్దతు పలికారు. ప్రజలకు, రైతులకు సేవ చేయాల్సిన కలెక్టర్ ఇలా చేయడం సరికాదన్నారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గుంట భూమి పోయినా పోటీ చేయను

కామారెడ్డి పట్టణ పరిధిలో మాస్టర్‌ప్లాన్‌లో రైతులకు సంబంధించి గుంట భూమి పోయినా తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం రైతులకు మేలు చేసే ప్రభుత్వం అన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఎవ్వరి భూమి పోకుండా మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానన్నారు. అనవసరంగా కొందరు నాయకులు రైతులను రెచ్చగొట్టి రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.



రాత్రి 8 గంటలకు కలెక్టరేట్ వద్ద రైతులు



పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు



బారికేడ్‌లను ఎత్తిపడేస్తున్న రైతులు



చెప్పలు చేతిలో పట్టుకొని మహిళా పోలీసులతో వాదిస్తున్న మహిళలు



కలెక్టరేట్ ప్రధాన గేటు తోసుకుంటూ లోనికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతులు, మహిళలు



కామారెడ్డిలో కుటుంబ సమేతంగా ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



గాయపడ్డ రైతు ఆస్పత్రికి తరలింపు..



మహిళా రైతుల దాడిలో గాయపడిన అడ్లూర్ ఎల్లారెడ్డి సర్పంచ్ భర్త జనార్దన్

పంచాయతీ పాలకవర్గం రాజీనామా!

సదాశివనగర్: కామారెడ్డి బల్దియా మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ సర్పంచ్ మినహా అడ్లూర్ ఎల్లారెడ్డి పంచాయతీ పాలకవర్గం తమ పదవులకు రాజీనామా చేసింది. మాస్టర్ ప్లాన్‌తో భూములను కోల్పోతున్నామని మనస్తాపానికి చెందిన అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన రైతు పయ్యావుల రాములు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఆవేదనకు గురైన ఉపసర్పంచ్‌తో పాటు తొమ్మిది మంది వార్డుసభ్యులు గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. కామారెడ్డిలో కొందరి స్వార్థం కోసం కొత్త మాస్టర్‌ప్లాన్‌తో ఎంతో మందిని బలి చేస్తున్నారని, దీనికి నిరసనగా తాము రాజీనామా చేస్తున్నామని వారు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో ఉపసర్పంచ్ చింతల లక్ష్మీపతి, వార్డు సభ్యులు మోసర్ల శ్రీకాంత్, నర్సింలు, అనూష, రోజా, సుశీల, సరస్వతి, స్వప్న, బాబమ్మ, సావిత్రి ఉన్నారు.



తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఉపసర్పంచ్, వార్డుసభ్యులు

అధిక ధరలకు ఎరువుల విక్రయం

నందిపేట్: అధిక ధరలకు ఎరువులను అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని గురువారం రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. డీఏపీ బస్తా ధర రూ.1350 ఉండగా నందిపేటలోని పలు దుకాణాల్లో రూ.1420 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు గాను బిల్లులు అడిగితే నకిలీ బిల్లులు ఇస్తూ రైతులను మోసం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు. పిర్యాదు చేసిన వారిలో రైతులు గాండ్ల సంతు, దుబాయి శ్రీను, ఎర్రం బోజేందర్, నడ్కుడ గంగాదర్, నాగుల శ్రీనివాస్, మైపాల్, అర్సపల్లి చిన్న రెడ్డి, ఎరుకల గోవర్దన్, కంతం శేఖర్ ఉన్నారు.

దుకాణాల తనిఖీ

రైతుల ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈపీవోఎస్ మిషిన్‌కు ఫిజికల్ స్టాకుకు తేడాలు ఉన్న శివ ఫర్టిలైజర్, ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులు నివేదిక అందజేస్తున్నట్లు ఏడీఏ విజయలక్ష్మి తెలిపారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

ఇందల్వాయి: ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా గన్నారం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన టీఎల్ఎం(టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్) మేళాకు వారు హాజరయ్యారు. పాఠ్యంశాలను వస్తు రూపంలోకి మార్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడమే టీఎల్ఎం ఉద్దేశమని డీఈవో అన్నారు. ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను పరిశీలించారు. అనంతరం పీఆర్టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాములునాయక్, ఎంపీపీ రమేష్‌నాయక్, పాల వేణు, రమేష్, హెచ్ఎంలు వీరలక్ష్మి, సాయన్న, సర్పంచ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్ రావు

అంతర్రాష్ట్ర రెడ్‌క్రాస్ శిక్షణకు ఎంపిక

పిట్లం: అంతర్రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరానికి మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని గురువారం పాఠశాలలో రెడ్ క్రాస్ సభ్యులు అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటి మెంబర్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 13 వరకు హర్యానాలో జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రాష్ట్రం నుంచి 12 మంది విద్యార్థులను ఎంపిక చేసి టీబీ, మలేరియా, హెచ్ఐవీ నివారణ, స్వచ్ఛభారత్, డిజాస్టర్ మేనేజ్మెంట్, సోషల్ వాల్యూస్, ఐ డొనేషన్ తదితర విభాగాలపై ఏడు రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. నల్గొండ జిల్లా నుంచి ఐదుగురు, కామారెడ్డి ఏడుగురు విద్యార్థులు ఎంపికవగా అందులో ఆరుగురు బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు అన్నారు. రెడ్ క్రాస్ డివిజన్ చైర్మన్ వేణు, మండల చైర్మన్ నవీన్, మల్లన్న పాల్గొన్నారు.



విద్యార్థులతో రెడ్‌క్రాస్ సభ్యులు

జైలును సందర్శించిన సీనియర్ జడ్జి

ఖలీల్‌వాడి : నగర శివారులోని సారంగపూర్‌లోని జిల్లా జైలును సీనియర్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి గురువారం పరిశీలించారు. జైలులో స్టీల్ ఆల్మారీ ఫ్యాక్టరీ, ప్రింటింగ్ ప్రెస్, కిచెన్‌తో పాటు ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయసేవాధికార సంస్థ అందించే న్యాయసేవల గురించి ఖైదీలకు వివరించారు. వారికి న్యాయ సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, డిప్యూటీ జైలర్ రాజశేఖర్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలును పరిశీలిస్తున్న జిల్లా సీనియర్ జడ్జి పద్మావతి

జిల్లా ఓటర్ల లెక్క తేలింది

- నాలుగు నియోజకవర్గాల పరిధిలో 8,07,187మంది ఓటర్లు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలోని నాలుగు నియోజవర్గాల పరిధిలో గల ఓటర్ల లెక్క తేలింది. ఈ మేరకు ఎలక్షన్ కమిషన్ జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలలో స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్)-2023 తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,027 పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఎన్నికల కమిషన్ గతయేడు చేపట్టిన ఓటర్ జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన వారి పేర్లతోపాటు డూప్లికేట్ ఓట్లను కలిపి జిల్లావ్యాప్తంగా 19,827మంది పేర్లను జాబితా నుంచి తొలగించింది. ఓటర్ల జాబితా సవరణను పూర్తిచేసి గత నవంబర్ 09న విడుదల చేసిన డ్రాఫ్టలిస్టలో జిల్లాలో 7,99,840మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చింది. తదనంతరం వచ్చిన అభ్యంతరాలతోపాటు 18యేళ్ల పూర్తయిన వారిపేర్ల నమోదుతో జిల్లాలో 27,174మంది పేర్లను నూతనంగా చేర్చారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 8,07,187మంది ఓటర్లు ఉన్నారు. గత యేడు జారీచేసిన డ్రాఫ్టలిస్టతో పోలిస్తే ఫైనల్ లిస్టలో జిల్లావ్యాప్తంగా 7,347ఓట్లు పెరిగినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది.

కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో..

కామారెడ్డి పరిధిలో 266 పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయి. నవంబర్‌లో విడుదల చేసిన డ్రాఫ్ట్ లిస్ట్ ప్రకారం 2,29,122మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా నియోజకవర్గ పరిధిలో 7,710ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలతోపాటు కొత్త ఓటర్ల నమోదుతో 6,455మంది ఓటర్లను జాబితాలో చేర్చారు. ప్రస్తుతం ఈసీ విడుదల చేసిన ఎస్ఎస్ఆర్-2023ప్రకారం కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 2,27,867మంది ఓటర్లు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. డ్రాఫ్ట్ లిస్ట్ ప్రకారం 2,05,016మంది ఓటర్లు ఉన్నారు. సవరణలో భాగంగా 4,913ఓట్లను తొలగించారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలతోపాటు కొత్త ఓటర్ల నమోదుతో 7,572మంది ఓటర్లను జాబితాలో చేర్చారు. ప్రస్తుతం 2,07,675మంది ఓటర్లు ఉన్నారు.

జుక్కల్‌లో..

జుక్కల్ నియోజకవర్గం పరిధిలో 255పోలింగ్‌కేంద్రాలు ఉన్నాయి. డ్రాఫ్ట్ లిస్ట్ ప్రకారం 1,84,066మంది ఓటర్లు ఉన్నారు. 783ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తర్వాత 5,870మంది ఓటర్లను జాబితాలో చేర్చారు. ప్రస్తుతం 1,89,153మంది ఓటర్లు ఉన్నారు.

బాన్సువాడలో..

నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈసీ నవంబర్‌లో విడుదల చేసిన డ్రాఫ్ట్ లిస్ట్ ప్రకారం 1,81,636మంది ఓటర్లు ఉన్నారు. సవరణలో భాగంగా 6,421ఓటర్లను తొలగించారు. తర్వాత 7,277మందిని చేర్చారు. ప్రస్తుతం 1,82,492మంది ఓటర్లు ఉన్నారు. డ్రాఫ్ట్ లిస్ట్‌తో పోలిస్తే 856 మంది ఓటర్లు పెరిగారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామ శివారులో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. చింతం శంకర్ గేదె గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్తుండగా ఎర్తింగ్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

పేకాట స్థావరంపై దాడి

ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి శివారులో పేకాడుతున్న ఎనిమిది మందిని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కేశాపూర్ చోరీ కేసులో రూ.ఆరు లక్షల రికవరీ!

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్‌లో డిసెంబర్ 21న జరిగిన చోరీ కేసులో పోలీసులు రూ.ఆరు లక్షలు రికవరీ చేసినట్లు తెలిసింది. మోపాల్ మండలం తాడెంకు చెందిన సూర్యరెడ్డి బ్యాంక్‌లో రూ.13 లక్షల 30వేలు డ్రా చేసుకుని కేశాపూర్‌కు కారులో వెళ్లాడు. దొంగలు కారును అద్దాలు పగలగొట్టి డబ్బులను ఎత్తుకుపోయారు. దీనిపై పోలీసులు దొంగలను పట్టుకునేందుకు గత నెల 25న కర్నాటకకు వెళ్లారు. అక్కడ దొంగలు దొరకక పోగా వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఆచూకి కనుగొని అక్కడకు వెళ్లారు. వారు పోలీసులకు రూ.ఆరు లక్షలు ఇచ్చినట్లు సమాచారం.

మాల్యాద్రిరెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి ఈటల



కోటగిరి: బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రిరెడ్డి తండ్రి అంకిరెడ్డి గత నెల 28న మృతి చెందారు. గురువారం ఆయనను మాజీ మంత్రి ఈటల రాజేందర్ కొత్తపల్లి క్యాంపులోని వారి ఇంట్లో పరామర్శించారు. అంకిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు యాసాడ నర్సింగ్, సత్యనారాయణపురం సర్పంచ్ నేమాని వీర్రాజు, కొత్తకొండ భాస్కర్, భూపాల్, టి శంకర్ గౌడ్, మాధవ్, లక్ష్మీనారాయణ, దొరబాబు, గంగాధర్ గౌడ్, రంజ్యానాయక్ ఉన్నారు.

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

నందిపేట్: మోడల్ పాఠశాలకు వెళ్లేందుకు సకాలంలో బస్సు సౌకర్యం లేదని నిరసిస్తూ గురువారం నందిపేట మండల కేంద్రంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్థానిక నంది విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మోడల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకుంటారు. కాగా బడి సమయానికి వచ్చే నూత్‌పల్లి, అన్నారం, గాదేపల్లి గ్రామాల బస్సు సమయాన్ని ఆర్టీసీ అధికారులు మార్చారు. పాటు మోడల్ పాఠశాలకు వెళ్లే బస్సు సైతం రద్దు చేశారు. దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.



నందిపేటలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదాయం పెంచుకునే వ్యాపారాలు చేపట్టాలి

డిచ్‌పల్లి: ప్రతి మండల సమాఖ్య ఆదాయాన్ని పెంచుకునే విధంగా సీజనల్ వ్యాపారాలు చేపట్టాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. డిచ్‌పల్లిలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో గురువారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయం పెంచుకునే విధంగా సీజన్ టైంలో పచ్చళ్లు (మామిడికాయ, నిమ్మ, టమాటా) తయారు చేసి విక్రయించాలన్నారు. స్థానికంగా ఆదరణ ఉన్న వాటిని తయారు చేసి ఆదాయం సంపాదించాలన్నారు. అలాగే బ్యాంకులింకేజీ, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఏపీడీ మధుసూదన్, జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కే విప్లవ కుమారి, ఆర్ వనిత, ఎల్ లక్ష్మీ, స్త్రీనిధి డైరెక్టర్ పి ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

అక్రమ నిర్మాణం కూల్చివేత

ఖలీల్‌వాడి: నగరంలోని 21 డివిజన్ పరిధి ఎల్లమ్మ గుట్టలో మున్నూరుకాపు సంఘం భవనం వెనుక అక్రమ నిర్మాణం చేపట్టడంపై వివాదం చెలరేగింది. ఈ నెల 3న కాలనీకి చెందిన ఒక వర్గం వారు రాత్రి వేళ షెడ్డు నిర్మించారు. విషయం తెలుసుకున్న మరో వర్గానికి చెందిన కుల సంఘం సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేసి, సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రకరించడానికి యత్నించాడు. దీంతో అతడిపై దాడికి రావడంతో తమ కులసంఘం సభ్యులకు సమాచారం అందించారు. దీంతో గురువారం ఉదయం 10 గంటలకు అక్రమ నిర్మాణం వద్దకు కులసంఘం సభ్యులు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న నాలుగో టౌన్ ఎస్సై సందీప్, సిబ్బంది అక్కడి చేరుకొని పరిస్థితి చక్కదిద్దేందుకు యత్నించారు. వివాదం పెరుగుతుందని భావించిన ఎస్సై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. షెడ్డు కూల్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని మరో వర్గం భీష్మించుకొని కూర్చున్నారు. సీఐ జగడం నరేష్, ఎస్సై సందీప్ వారిని సముదాయించారు. పోలీసులు మున్సిపల్ అధికారులకు, సౌత్ తహసీల్దార్ సుదర్శన్‌కు సమాచారం అందించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అనుపమ, కరుణాకర్, శ్యామ్, స్వామి, తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ రాజు అక్కడి చేరుకున్నారు. ప్లాటుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన తర్వాత నిర్మాణం అక్రమంగా చేపట్టారని సిబ్బందితో గోడను, రేకులను తొలిగించారు. రెండు వర్గాలను అక్కడి నుంచి పంపించి షెడ్డును తొలిగించిన దానిని మున్సిపల్ ఆఫీసుకు తరలించారు. దీంతో ఓ వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యే వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఎంఐఎం పార్టీ నేతలను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. పోలీసులు అక్కడే బందోబస్తు ఏర్పాటు చేశారు. షెడ్డు వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సైలు పూర్ణేశ్వర్, మహేష్, సాయినాథ్‌తోపాటు కానిస్టేబుళ్లు ఉన్నారు.



షెడ్డును కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది